క్లుప్తంగా

వసతి గృహంలో తనిఖీలు



వంట గదిని పరిశీలిస్తున్న వీసీ

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో పురుషుల వసతి గృహాన్ని వీసీ అల్లం శ్రీనివాసరావు బుధవారం తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, వసతి గదులను, భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

విద్యా ప్రమాణాలను పెంచాలి



మాట్లాడుతున్న సునీత

ఇందుకూరుపేట: పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించాలని ప్రథమ్ సంస్థ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బుర్రా సునీత పేర్కొన్నారు. మండలంలోని మైపాడులో గల పాఠశాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఎమ్మెఫ్ఎస్ మోడల్ ఫౌండేషన్ పాఠశాలలు.. అంగన్‌వాడీ కేంద్రాలు.. 1, 2వ తరగతుల పిల్లలకు టీఎల్ఎమ్ ప్రాధాన్యాన్ని వివరించారు. జిల్లా అకడమిక్, మానిటరింగ్ అధికారి సుధీర్ బాబు, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల మండలి కమిటీ నియామకం



నెల్లూరు(టౌన్): వినియోగదారుల హక్కుల మండలి జిల్లా నూతన కమిటీని బట్వాడిపాళెం సెంటర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్లో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముజీర్ రోజ్దార్, వైస్ ప్రెసిడెంట్‌గా ప్రశాంతి, సెక్రటరీగా హరికృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీగా విశ్వమైత్రి, ట్రెజరర్‌గా సమీనా మొఘల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రద్యుమ్నరెడ్డి, మీడియా అడ్వైజర్‌గా విక్రమ్, మెంటార్లుగా భూలక్ష్మీదేవి, మన్నెం చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు.

వర్షపు నీరు నిల్వ ఉండకూడదు



సూచనలు చేస్తున్న నందన్

నెల్లూరు(బారకాసు): ఆత్మకూరు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. ఆత్మకూరు బస్టాండు ఫ్లయ్‌ఓవర్, శెట్టిగుంట రోడ్డులోని చేపల మార్కెట్, మినీ బైపాస్, ముత్తుకూరు గేట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టేలా ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. అనంతరం రెవెన్యూ, పోస్టల్ కాలనీలు, కొత్తూరు, పొదలకూరు రోడ్డు ప్రాంతాల్లో నిర్మిస్తున్న రోడ్లు, కాలువలను పరిశీలించారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భవన్ వద్ద ధర్నా రేపు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ భవన్ వద్ద ధర్నాను ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్నామని కమిటీ నేత సుమన్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలనే అంశమై విజయవాడలోని విద్యుత్‌సౌధలో జేఏసీ నేతలు అదే రోజున చర్చలు జరపనున్నారని, వీరికి సంఘీభావంగా ధర్నాను చేపట్టనున్నామని వివరించారు. భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. యూఈఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, నేతలు హజరత్తయ్య, జాకీర్‌హుస్సేన్, నాగయ్య, పెంచలప్రసాద్, హరినారాయణ, మహేష్, రాజమోహన్, సునీల్, భాస్కర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సహవాసం

- నీటి సరఫరాకు ట్యాంకేదీ..?
- మోటార్ మరమ్మతులకు గురైతే తాగునీటి సరఫరా కట్
- దత్తత తీసుకొని గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్న ఎమ్మెల్యే
- కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటినా అభివృద్ధి జాడేదీ..?



పంచాయతీ కార్యాలయమున్న ప్రాంతంలో పశువులను కట్టేసి..

కొడవలూరు: మండలంలోని బసవాయపాళెంలో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడి పంచాయతీకి సొంత భవన సదుపాయం లేదు. తాగునీటి సరఫరాకు ట్యాంక్ లేదు. పంచాయతీలో ఏదైనా పని నిమిత్తం వెళ్లాలంటే ఎక్కడికెళ్లాలో తెలియని పరిస్థితి. మోటార్ మరమ్మతులకు గురైతే కనీసం నాలుగు రోజుల పాటు తాగునీటి సమస్య నెలకొంటోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని గత ఎన్నికల ప్రచారంలో అప్పటి టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా గ్రామంలో అభివృద్ధి పనులు నేటికీ జరగకపోవడం విమర్శలకు తావిస్తోంది.

అన్నీ సమస్యలే..

అల్లూరు రోడ్డును ఆనుకొని ఉన్న బసవాయపాళెం పంచాయతీలో 800కుపైగా ఓటర్లున్నారు. ఈ గ్రామ పంచాయతీకి సొంత భవన సదుపాయం లేదు. తొలుత ఇది ఉన్నా, ఏళ్లు గడిచిపోవడంతో శిథిలావస్థకు చేరింది. శ్లాబు పెచ్చులూడుతుండటంతో భవనాన్ని కొంత కాలం ఖాళీగా వదిలేశారు. ఆపై పూర్తిగా కూల్చేశారు. వచ్చిన టేకు కలపకు బహిరంగ వేలాన్ని నిర్వహించాల్సి ఉండగా, ఇవేవీ లేకుండానే మాయం చేశారు. ప్రస్తుతం పాత పంచాయతీ స్థలం ఖాళీగా ఉండటంతో సమీప నివాసాల వారు పశువులను అందులోనే కట్టేస్తున్నారు. గత పాలకమండలి ఏర్పడ్డాక అల్లూరు రోడ్డుకు పక్కనే ఉన్న ప్రైవేట్ వ్యాపార సముదాయంలోని ఒక కొట్టులో పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కొద్దిరోజులు గడిచాక ఖాళీ చేశారు. గ్రామానికి మంచినీటిని సరఫరా చేసే ట్యాంక్ సదుపాయం లేకపోవడంతో డైరెక్ట్ పంపింగ్ ఇస్తున్నారు. విద్యుత్ మోటార్ మరమ్మతులకు తాగునీటికి కటకట తప్పడంలేదు. గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ప్రకటించి.. విస్మరించడంపై గ్రామస్తుల్లో అసహనం వ్యక్తమవుతోంది.

పంచాయతీల్లో వసతులు కల్పించాలి

- మండల పరిషత్ అధ్యక్షురాలు స్వర్ణలత



సమీక్ష నిర్వహిస్తున్న మండల అధికారులు

తోటపల్లిగూడూరు: పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పల స్వర్ణలత సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. పలు శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేపట్టారు. ఎంపీపీ స్వర్ణలత మాట్లాడుతూ పంచాయతీల్లో వసతులు సక్రమంగా లేక గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వీడాలన్నారు. సమావేశానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడంపై పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండిపడ్డారు. 20 శాఖలకు గానూ 14 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో నరుకూరు ఎంపీటీసీ సభ్యుడు కొణతం రఘుబాబుతో పాటు పలువురు మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు అధికారుల తీరును ఎండగట్టారు. గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులునాయుడు, తహసీల్దార్ వీరి సుధీర్ ఎంపీడీఓ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

వెంకటాచలం: మండలంలోని కంటేపల్లి గ్రామంలో కామాక్షిదేవి సమేత ఏకాంబరేశ్వర స్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నంది, నవగ్రహాల ప్రతిష్ఠ మహా కుంబాభిషేక మహోత్సవ కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. అలాగే పడమటి గిరిజన కాలనీలో మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, తూర్పు గిరిజన కాలనీలో మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నిర్మాణానికి పూజ, ఎస్సీ కాలనీలో చెన్నకేశవస్వామి దేవస్థానం నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం షాపుల లైసెన్సీలతో సమావేశం

కోవూరు: కోవూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం షాపుల లైసెన్సీలతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ కిశోర్ మాట్లాడారు. ఈ యాప్‌ను లైసెన్సీలు తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని, స్కానింగ్ మోడ్ ద్వారానే నిర్వహించాలని సూచించారు.

➡ **ఇందుకూరుపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం సరైందా.. లేదా నకిలీదాననే అంశాన్ని తెలుసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మద్యం షాపుల లైసెన్సీలతో సమావేశాన్ని నిర్వహించారు.

➡ **పొదలకూరు:** నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రవేశపెట్టినట్టు పొదలకూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ వెంకటేశ్వరావు పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ విలేకరులతో మాట్లాడుతూ యాప్‌తో మద్యం బాటిల్‌పై ఉన్న బార్‌కోడ్‌ను స్కాన్ చేస్తే తెలిసిపోతుందన్నారు.

గంజాయి వాడకంతో అనర్థాలు



కొడవలూరు: గంజాయి వాడకంతో అనర్థాలు సంభవిస్తాయని ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్ పీవీ రెడ్డి పేర్కొన్నారు. వరల్డ్ మెంటల్ హెల్త్ డేను పురస్కరించుకొని గంజాయి వాడకంతో సంభవించే అనర్థాలపై నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాధవీలత, కళాశాల చైర్మన్ గుణశేఖర్, ఏఓ గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం



మాట్లాడుతున్న హేనాసుజన్

ఇందుకూరుపేట: అర్హులను ప్రధాన మంత్రి మాతృయోజనలో నమోదు చేయాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ పేర్కొన్నారు. మండలంలోని సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం పూర్తి చేయాలని సూచించారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని చెప్పారు.

పాఠశాలలో హ్యాండ్ వాష్ డే



పొదలకూరు మండలంలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మున్సిపల్ కార్యాలయంలో..

పొదలకూరు: గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా బుధవారం మండలంలోని బి.చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారికి అవగాహన కల్పించారు.

- **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** చేతుల శుభ్రతపై విద్యార్థులు, పొదుపు మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కమిషనర్ బాలకృష్ణ, మెప్మా ఐబీ అంకయ్య నిర్వహించారు. చేతులను శుభ్రం చేసుకోవడాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న స్కూల్ బస్సు

మనుబోలు: స్కూల్ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటన మండలంలోని కొలనకుదురు సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. ఆ సమయంలో వాహనంలో విద్యార్థుల్లేరు. తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు విద్యార్థులను దించేసి తిరిగి వెళుతుండగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ఘటన చోటుచేసుకుంది. అతనికి స్వల్ప గాయాలయ్యాయి.



ఘటనా స్థలంలో బస్సు

స్త్రీ విద్యతోనే సమాజాభివృద్ధి



కొడవలూరు: చంద్రశేఖరపురంలో..



కొడవలూరు: రెడ్డిపాళెం హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ

కొడవలూరు: స్త్రీ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్త్రీ విద్య ప్రాధాన్యంపై మండలంలోని రెడ్డిపాళెం హైస్కూల్లో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీని జరిపారు. హెచ్ఎం అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, మంజుల, శీనమ్మ, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

➡ బాలిక విద్య చట్టపరమైన హక్కు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ పేర్కొన్నారు. మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రీతమ్ బిశ్వాస్, ఉపాధ్యాయులు బలరామిరెడ్డి, నాజుల్, సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు చెంచమ్మ, లక్ష్మీప్రసన్న, కృష్ణవేణి, హెల్పర్ ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఈఐన్సీకి పుష్పగుచ్ఛమిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఆర్అండ్‌బీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి అసోసియేట్ చైర్మన్ శరత్‌బాబు కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ శేషుకుమార్‌ను నెల్లూరులోని దర్గామిట్టలోని ఆ శాఖ ఎస్ఈ కార్యాలయంలో అసోసియేషన్ నేతలు బుధవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం శరత్‌బాబు మాట్లాడారు. జిల్లా విభజన సమయంలో ఆర్ అండ్ బీ శాఖలోని నెల్లూరు సర్కిల్ నుంచి 17 మంది ఉద్యోగులను తిరుపతికి బదిలీ చేశారని, ఇందులో దివ్యాంగురాలూ ఉన్నారని చెప్పారు. దీంతో ఇక్కడ సిబ్బంది లేకుండాపోయారని, ఉన్న వారితో పనులు కావడంలేదని తెలిపారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

ఘనంగా అబ్దుల్ కలామ్ జయంతి



వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో అబ్దుల్ కలామ్ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ అల్లం శ్రీనివాసరావు వర్సిటీలోని కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కలలు కనడమే కాకుండా వాటిని సాకారం చేసుకునే దిశగా కృషి చేయాలనే స్ఫూర్తిని యువతకు అబ్దుల్ కలామ్ అందించారని తెలియజేశారు. సాధారణ కుటుంబం నుంచి ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తగా, దేశ ప్రథమ పౌరుడిగా ఎదిగిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు



హనీఫ్, ఎస్సై



మాట్లాడుతున్న సీఐ రవినాయక్

పొదలకూరు: దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై ఎస్‌కే ఎండీ హనీఫ్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లైసెన్స్‌లున్న వారే బాణసంచా విక్రయించాలని, లేని వారు అమ్మినా, తయారు చేసినా 12 సంవత్సరాల శిక్ష పడేలా చట్టాలున్నట్టు తెలిపారు. పట్టణంలోని హంసరెడ్డి కల్యాణ మండపం వద్ద అన్ని దుకాణాలను ఏర్పాటు చేయిస్తున్నామని, వ్యాపారులు నీరు, ఇసుక పెద్ద స్థాయిలో ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అధికారులతో ఏర్పాటైన మండల కమిటీ నిర్ణయాల ప్రకారం దుకాణాలు పెట్టుకుని అమ్మకాలు సాగించాల్సి ఉంటుందన్నారు.

నరుకూరు సెంటర్‌లో దుకాణాల నిషేధం

తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు సెంటర్‌లో టపాకాయల దుకాణాల ఏర్పాటు నిషేధమని కృష్ణపట్నం పోర్టు సీఐ రవినాయక్ స్పష్టం చేశారు. స్థానిక ఎస్సై వీరేంద్రబాబుతో కలిసి సీఐ బుధవారం తోటపల్లిగూడూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. వ్యాపారులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి అనుమతులను పొందాలన్నారు.

- **కొడవలూరు:** అనుమతుల్లేకుండా బాణసంచాను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కోటిరెడ్డి స్పష్టం చేశారు. కొడవలూరు పోలీస్‌స్టేషన్లో విలేకరులతో ఆయన మాట్లాడారు. నార్తురాజుపాళెంలో నాలుగు దుకాణాలకే అనుమతులున్నాయని వివరించారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే దుకాణాన్ని సీజ్ చేయడంతో పాటు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులను నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోండి

- వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

వెంకటాచలం: సీపీఆర్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సీపీఆర్ వంటి ప్రాథమిక వైద్య పద్ధతులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైద్య బృందం విద్యార్థులకు సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, రెడ్‌క్రాస్ వైద్య నిపుణులు డాక్టర్ యశోవాన్, రాజేంద్రన్, సుధార్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి



హాజరైన అధికారులు

కొడవలూరు: పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన గృహాలను త్వరలో మంజూరు చేయనున్నామని వెల్లడించారు. పక్కా గృహాలు నిర్మించుకున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీఓ వెంకటసుబ్బారావు మాట్లాడారు. ఉపాధి కూలీలకు మస్టర్లు వేసే విషయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. పీఆర్ ఏఈ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హర్షిత, హౌసింగ్ ఏఈ వంశీకృష్ణ, ఈసీ సోఫియా, టీఏ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మనుబోలు : మాట్లాడుతున్న సీడీపీఓ



పొదలకూరు : పోషణ్ మహా ర్యాలీ

మనుబోలు: పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మనుబోలు సీఎం నగర్ ఎస్టీ కాలనీ, రాజోలుపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో చూపించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఆదినారాయణమ్మ, పద్మజ, ఏఎన్ఎం రాజేశ్వరి, అంగన్‌వాడీలు సుగుణమ్మ, నిర్మల, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

➡ **పొదలకూరు:** మండలంలోని డేగపూడి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ అధికారులు పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్ లేఖన, మర్రిపల్లి సెక్టార్‌లోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా కార్డుల పంపిణీ



ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని పిడతాపోలూరు రైతులకు యూరియా పంపిణీ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ జ్యోత్స్న రాణి మాట్లాడుతూ ఎకరా వరిసాగుకు మూడు దఫాలకు మూడు బస్తాలు, వేరుశనగకు ఒక బస్తా మాత్రమే అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు కార్డు ద్వారానే యూరియా తీసుకోవాల్సిందిగా సూచించారు. సొసైటీలు, ఎరువుల దుకాణలు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా లభిస్తుందని వెల్లడించారు. రబీలో రైతులు రైతు సేవా కేంద్రాల్లో సాగు వివరాలను వెల్లడించాలన్నారు. ప్రతి రైతు కార్డులను విధిగా తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని 16వ వార్డులో పార్కు పక్కన నిర్మిస్తున్న మున్సిపల్ నూతన భవనం రెండో అంతస్తు శ్లాబు బుధవారం పూర్తయింది. ఈ సందర్భంగా పూజలను చైర్‌పర్సన్ సుప్రజ, కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ తదితరులు నిర్వహించారు. భవనాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నామని సుప్రజ తెలిపారు.